క్లుప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ఏఈఓ రాజేశ్వరి

కేశంపేట: నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన అర్హులైన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వరి తెలిపారు. పాపిరెడ్డిగూడ క్లస్టర్ పరిధిలో 5,600 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని ఆమె తెలిపారు. గతంలో రైతు భరోసా వస్తున్న రైతులు కాకుండా నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పలపల్లి గ్రామంలో ఉన్న రైతు వేదిక వద్ద దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసు పుస్తకం లేదా భూమి ఆన్‌లైన్‌లో ఉన్న పేపర్, ఆధార్‌కార్డుతో పాటు బ్యాంక్ డిటెయిల్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

'మంద కృష్ణకు అవార్డు హర్షణీయం'

చేవెళ్ల: దేశ అత్యున్నత పురస్కారం పద్మశ్రీ అవార్డు మంద కృష్ణ మాదిగకు రావడం ఆయా వర్గాలకు దక్కిన గౌరవమని ఎమ్మార్పీఎస్ మండల వ్యవస్థాపక మాజీ అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ గంగి యాదయ్య అన్నారు. చేవెళ్లలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం మూడు దశాబ్దాలుగా చేస్తున్న ఉద్యమాలకు ఊతం ఇచ్చినట్లుగా కేంద్రం అందించిన ఈ పురస్కారమే నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని 30 ఏళ్లుగా కొనసాగిస్తున్నాడన్నారు. అణగారిన వర్గాల ప్రజల కోసం ఆయన పోరాటం కొనసాగిందని, అనేక సామాజిక సమస్యలపై నిరంతరం ఉద్యమించిన నాయకుడని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మంద కృష్ణ మాదిగ ఉద్యమాన్ని గుర్తించి ఆయనకు ఈ అవార్డును అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ సామాజికవర్గంతో పాటు అన్ని వర్గాల ప్రజలు కూడా ఆయనకు పద్మశ్రీ రావటం హర్షణీయమని కొనియాడుతున్నారన్నారు.

చిన్నారులకు యూనిఫామ్ అందజేత



చిన్నారులకు యూనిఫామ్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు వచ్చిన యూనిఫామ్‌ను సోమవారం అంగన్‌వాడీ టీచర్ కవిత, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీలత, పాఠశాల చైర్‌పర్సన్ మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు కవిత, రజిని, పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం ఆంజనేయులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇంగ్లిష్ హైపాస్ మోడల్ పేపర్ ఉపయోగపడుతుందని హెచ్‌ఎం ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు రాములు 10వ తరగతి చదివే విద్యార్థులకు ఇంగ్లిష్ హైపాస్ మోడల్ పేపర్ల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఏట్లఎర్రవల్లి గ్రామ రైతుల ఖాతాలో జమ చేసినట్లు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామాన్ని ఎంపిక చేసి, గ్రామంలోని 573 మంది రైతులకు రైతు భరోసా డబ్బులు రూ.64లక్షల 45వేలు వారి ఖాతాలో ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరు సైతం త్వరలోనే చేస్తామన్నారు. హామీలను మాట తప్పకుండా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. డబ్బులు జమ చేయడంపై రైతుల తరఫున ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదమరిస్తే.. అంతే!

- రోడ్డు, ఇళ్ల పక్కనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా మారిన వైనం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



మొయినాబాద్‌రూరల్: ఎన్కెపల్లిలో పాఠశాలకు వెళ్లే రహదారి పక్కన ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



అజీజ్‌నగర్‌లో పోచమ్మ దేవాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న పిచ్చిమొక్కలు

మొయినాబాద్‌రూరల్: మండలంలో ఏళ్ల తరబడి విద్యుత్ సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయి. రోడ్డు పక్కన కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటిని ఏర్పాటు చేసి ఏళ్లు కావొస్తున్నా రక్షణగా కంచెలు ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగినా పట్టించుకునే నాథులే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రమాదకరంగా మారినా..

మండలంలోని అజీజ్‌నగర్, ఎన్కెపల్లి, హిమాయత్‌నగర్, బాకారం, చిన్నమంగళారం తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటి చుట్టూ రక్షణ కంచెలు లేకపోవడంతో దిమ్మెలు సైతం తక్కువ ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అజీజ్‌నగర్ పోచమ్మ ఆలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను పిచ్చిమొక్కలు, తీగలు అల్లుకున్నాయి. రోడ్డు పక్కనే ఇళ్ల ముందు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, వాటికి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఎన్కెపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లే రహదారి పక్కన కంచెలేకుండా ట్రాన్స్‌ఫార్మర్ తీగలతో రోడ్డుపై పడి ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి



అజీజ్‌నగర్ పోచమ్మ ఆలయం వద్ద ఇళ్ల పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పిచ్చిమొక్కలు, తీగలు అల్లుకున్నాయి. చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పిల్లలు ఈ ప్రాంతంలో ఆడుకుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు కంచెను ఏర్పాటు చేసి పిచ్చిమొక్కలను తొలగించాలి.

– అద్వానీ, అజీజ్‌నగర్, మాజీ వార్డు సభ్యుడు

కంచె ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి. విద్యుత్ ప్రమాదాలు జరిగినా అధికారులు మాత్రం ఈ వాటి చుట్టూ కంచెను ఏర్పాటు చేయడం లేదు. హిమాయత్‌నగర్ ఎన్‌టీఆర్ పాఠశాలకు వెళ్లే రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచెను ఏర్పాటు చేయాలి.

– అశోక్, హిమాయత్‌నగర్

నేలపై విద్యుత్ తీగలు, అర్తింగ్ వైర్లు



మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో పాఠశాలకు వెళ్లే రహదారి పక్కన అర్తింగ్ వైర్లు, తీగలు నేలపై వేలాడుతున్నాయి. ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఆ రోడ్డు పక్క నుంచి నిత్యం విద్యార్థులు పాఠశాలకు వెళ్తుంటారు. ప్రమాదాలు జరగకముందే కంచెను ఏర్పాటు చేయాలి.

– పెంద్యాల శ్రీనివాస్, ఎన్కెపల్లి

ముదిరాజ్‌ల అభ్యున్నతికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు అందె బాబన్న, అందె మోహన్, వెంకటేశ్, శ్రీధర్‌వర్మ, అశోక్, కొండె యాదయ్య, చెట్ల జంగయ్య, అంజయ్య, గడ్డమీది రమేశ్, నలమోని శ్రీధర్, బాల్‌రాజ్, మల్లేశ్, బుద్ద నర్సింహ, జంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం షాద్‌నగర్ పట్టణ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు పంది వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అబ్దుల్‌రావుఫ్, మల్లేశ్, ఉమాప్రసాద్, అల్లాడ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కొమరేశ్, రవికుమార్, రాఘవేందర్, మీడియా కన్వీనర్‌గా ఆదిత్యారెడ్డి, కోశాధికారిగా మేకల వెంకటేశ్, ఉపకోశాధికారిగా నర్సింలు, మల్లేశ్, చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా జాకీరుద్దీన్, సలహాదారులుగా వంశీకృష్ణ, నాగిళ్ల వెంకటేశ్, సభ్యులుగా మిద్దెల వెంకటేశ్, రాఘవేందర్‌రెడ్డి, హరికృష్ణను ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులకు డివిజన్ అధ్యక్షుడు నియామకపత్రం అందజేశారు.

'లక్ష డప్పుల'ను విజయవంతం చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాబాద్: వేల గొంతులు, లక్ష డప్పులు మహా ప్రదర్శన విజయవంతం చేసి రాష్ట్రంలో మాదిగల ఐక్యతను చాటాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు జోగు అశోక్‌కుమార్, మండల నాయకుడు అక్కమొల్ల జంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 7న వేల గొంతులు, లక్ష డప్పులు మహా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్గీకరణ వ్యతిరేక శక్తుల గుండెలు అదిరేలా వేల గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను త్వరగా అమలుచేయాలని ప్రజా, కుల సంఘాల మేధావులు అభిప్రాయపడ్డారు. చేవెళ్ల డివిజన్ నాయకులు నాగని రామకృష్ణ(ఆర్‌కే) మాట్లాడుతూ.. మండంలోని అన్ని గ్రామాల మాదిగ బిడ్డ డప్పు వేసుకుని తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, బాల్‌రాజ్, బాలయ్య, కిష్టయ్య, మధు తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి



మొయినాబాద్‌లో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల డిప్యూటీ తహసీల్దార్ వినోద్ కుమార్‌కు పీఆర్టీయూ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30–35 సంవత్సరాల పాటు సర్వీస్ అందించిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పొందడం ప్రాథమిక హక్కు అన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని గత 20 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వంపై ఉద్యోగ ఉపాధ్యాయులు ఉద్యమం చేస్తుంటే దానికి వ్యతిరేకంగా మరో కొత్త విధానం యూపీఎస్‌ను తీసుకురావడాన్ని పీఆర్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు భద్రత కరువు

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని కోరుతూ పీఆర్టీయూ నాయకులు సోమవారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏకీకృత పెన్షన్ విధానంతో ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేదన్నారు. గతంలో ఉన్న సీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, కమలేశ్, నవనీత, శిరీష, రాజ్‌కుమార్, అనూష, సంగీత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ పాలకుల హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. షాద్‌నగర్ శివారులో నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి బీఆర్‌ఎస్ హయాంలోనే మంజూరైందని, సగం పనులు పూర్తి చేసినా నాటి కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించలేదన్నారు. అదేవిధంగా కొత్తూరు నుంచి షాద్‌నగర్ వరకు విస్తరించిన పాత జాతీయ రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి డబ్బులు ఇప్పించారన్నారు. పట్టణంలో నిర్మించాల్సిన రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను గత పాలకులే నిలిపివేయించారని ఆరోపించారు. అదేవిధంగా ఉద్యమకారుడు దిలీప్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నాయకుడు మాధవులు మాట్లాడుతూ.. ఎంతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న గత మున్సిపల్ పాలకవర్గం వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. బీఆర్‌ఎస్ పార్టీలో అధిక శాతం ఉద్యమకారులు అసంతృప్తితోనే ఉన్నారన్నారు. ఎదుటివారిని విమర్శించే ముందు తమకు తాము ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు అగ్గనూరు బస్వం, నలమోని శ్రీధర్, బుడ్డ నర్సింహ, హైదర్‌గోరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుర్రంపల్లి ఉత్సవాలు



జాతరలో భక్తుల సందడి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లిలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 24న గంధం అలంకరణతో ప్రారంభమైన ఉత్సవాలు 25న దీపదూప అలంకరణ, 26న కందూరులు, 27న కవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో పూర్వ కాలంలోనే వెలసిన రాతి గుర్రం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ప్రతి ఏటా జనవరి చివరి వారంలో ఇక్కడ నిర్వహించే ఉత్సవాలకు రంగారెడ్డి, వికారాబాద్, హైద్రాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట తదితర జిల్లాలో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి ఇక్కడికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఈ జాతరకు కుల, మతాలకతీతంగా భక్తులు హాజరై దర్శించుకోవడం విశేషం. ఈ ఉత్సవాలు మరో నాలుగురోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మంద కృష్ణకు శుభాకాంక్షలు

చేవెళ్ల: మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చినందుకుగాను చేవెళ్ల బీజేపీ నాయకులు సోమవారం నగరంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



మంద కృష్ణ మాదిగకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

విద్యార్థులకు ప్రోత్సాహం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కళాశాల సిబ్బంది, ట్రస్ట్ ప్రతినిధులు

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, పోలారిస్ ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం మండల పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సదస్సు నిర్వహించి ఉపకార వేతనాలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యానారాయణరెడ్డి మాట్లాడుతూ.. భావితరాలకు దిశా నిర్దేశం చేసేది పాఠశాల మాత్రమే అన్నారు. తరగతి గది నుంచే విద్యార్థులు తమ లక్ష్యసాధనకు కావాల్సిన మార్గాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో పోలారిస్ ఉల్లాస్ ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్, శిరీష, శ్రీను, కళాశాల డీన్ ఉదయశ్రీ, వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్: మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కవిత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 2025–2026 విద్యాసంవత్సరానికి గాను మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయి. మిగతా 7, 8, 9, 10వ తరగతిల్లో ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 28 చివరి తేదీ అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.125 చెల్లించాలని, ఓసీలకు రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వాచ్యా, రఘుగౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మొయినాబాద్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో చేగూరి రిషికిరణ్‌గౌడ్ జ్ఞాపకార్థం నిర్వహించిన విలేజ్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత



విద్యార్థులకు క్రీడా దుస్తులు అంజేస్తున్న దాత

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ మద్దూరు పాండు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకటమ్మగూడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మిద్దె అనసూయ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు మిద్దె హరీశ్ క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సింహాద్రినాయుడు, ఉపాధ్యాయులు హేమసుందర్ రావు, అంగన్‌వాడీ టీచర్ వినోద, సునీత, గ్రామస్తులు సరిత, కుమార్, నర్సింలు, మాణిక్యం, శ్రీకాంత్, రవి, బీరప్ప, మధు తదితరులు ఉన్నారు.

కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఐకేపీ ఏపీఎం నర్సింలు



కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సింలు

షాబాద్: మహిళలు ఉచిత కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం నర్సింలు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దవేడు గ్రామంలో అమెజాన్ సంస్థ సహకారంతో కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో ముందుకు సాగాలని సూచించారు. శిక్షణ పూర్తయిన తర్వాత మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, సంస్థ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ మల్లేశ్, పాఠశాల చైర్‌పర్సన్ అనిత, గ్రామస్తులు అశోక్‌గౌడ్, నవీన్‌గౌడ్, రాజుగౌడ్, వంశీగౌడ్, కృష్ణగౌడ్, యాదగిరి, మురళీ, శ్రీధర్, శ్రీను, నాని, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



దర్గాకు పూలు, దట్టీలను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు గ్రామంలో ఉన్న హజరత్ మఖ్దుం బియాబాని దర్గా ఉర్సు ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. ప్రతి ఏడాది ఉర్సు వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం దర్గా వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఈ ఉత్సవాల్లో స్థానిక నాయకులతో కలిసి పాల్గొని దర్గాలో దట్టి, పూలను కప్పి ప్రార్థనలు చేశారు. స్థానిక మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు ఎం.కృష్ణారెడ్డి, శ్రీశైలం, ప్రశాంత్, సలీం, బాబర్, షబ్బీర్, తోట శేఖర్, నర్సింలు, రఫీక్ తదితరులు ఉన్నారు.